# 320 మందిని మింగిన భూకంపం

- వందలాది మందికి గాయాలు
- గజగజ వణికిన అఫ్గానిస్థాన్



హేరాట్, అక్టోబర్ 7: అఫ్గానిస్థాన్‌ను శనివారం అరగంట పాటు భారీ భూకంపం కుదిపేసింది. పశ్చిమ ఆఫ్గాన్‌లో 6.3 తీవ్రతతో సంభవించిన ఈ భూకంపం వల్ల 320 మంది మృతిచెందగా, వందలాది మంది గాయపడినట్టు ఐరాస వెల్లడించింది. భూకంపం కారణంగా పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. అనేక భవనాలు కుప్పకూలాయని, కూలిపోయిన భవనాల కింద పలువురు చిక్కుకుని ఉండటంతో మృతుల సంఖ్య ఇంకా పెరగవచ్చని హేరాట్ ప్రావిన్స్‌కు చెందిన పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ మహమ్మద్ తాలేబ్ షాహిద్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఏర్పడిన ప్రకంపనలతో ఇండ్లు, కార్యాలయాలు వదిలి ప్రజలు భయంతో పరుగులు తీశారు. తీవ్ర ప్రకంపనలకు కొన్ని భవనాలు నేలకూలడంతో పలువురు శిథిలాల కింద చిక్కుకుపోయారు. చాలా మంది కట్టుబట్టలతో హేరాట్ నగర వీధుల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సాయం కోసం ఎదురుచూస్తు కనిపించారు. హేరాట్ నగరానికి వాయవ్య మూల 40 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్టు అమెరికా జియలాజికల్ సర్వే వెల్లడించింది. 5.5, 4.7, 6.3, 5.9, 4.6 తీవ్రతతో ఐదుసార్లు ప్రకంపనలు చోటుచేసుకున్నట్టు ప్రకటించింది. కాగా, అఫ్గాన్‌లో తరచూ ఏర్పడే భూకంపాల కారణంగా తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం ఏర్పడుతుంది. గత ఏడాది జనవరిలో ఏర్పడిన భారీ భూకంపం వల్ల వెయ్యి మంది మృతి చెందగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు.



## గగన్‌యాన్ స్పేస్‌క్రాఫ్ట్ ఫొటోల విడుదల

న్యూఢిల్లీ, అక్టోబర్ 7: వచ్చే ఏడాది డిసెంబరు నాటికి అంతరిక్షంలోకి మానవుల్ని తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) గగన్‌యాన్ అంతరిక్ష నౌక ఫొటోలను శనివారం విడుదల చేసింది. ఈ మిషన్‌కు సంబంధించి మానవరహిత ఫ్లైట్ టెస్టులను ప్రారంభించనున్నట్టు తెలిపింది. క్రూ ఎస్కేప్ వ్యవస్థ పనితీరును ప్రదర్శించే తొలి ఫ్లైట్ టెస్ట్ వెహికల్ అబోర్ట్ మిషన్-1 (టీవీ-డీ1)ను పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్టు ఇస్రో వివరించింది. అత్యవసర పరిస్థితుల్లో రాకెట్ నుంచి వ్యోమగాములతో కూడిన క్రూ మాడ్యూల్‌ను సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లడంలో క్రూ ఎస్కేప్ వ్యవస్థ సాయపడుతుందని పేర్కొంది. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా ఇద్దరు లేదంటే ముగ్గురు వ్యోమగాములను భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కక్ష్యలోకి తీసుకెళ్తారు. మూడు రోజులు వారిని అక్కడే ఉంచి ఆ తర్వాత సురక్షితంగా వెనక్కి తీసుకొస్తారు. ఈ క్రమంలో వారిని భారత జలాల్లో సురక్షితంగా ల్యాండ్ చేస్తారు. టెస్ట్ ఫ్లైట్ విజయం తర్వాత మిగతా అర్హత పరీక్షలు, మానవరహిత పరీక్షలు నిర్వహిస్తారు.



హమాస్ మిలిటెంట్లు జరిపిన దాడుల్లో దగ్ధమవుతున్న ఇజ్రాయెల్‌లోని కార్లు



ఇజ్రాయెల్ సేనలు జరిపిన దాడుల కారణంగా మంటల్లో చిక్కుకున్న గాజా నగరం

# ఇజ్రాయెల్ X పాలస్తీనా

- ఇజ్రాయెల్‌పై హఠాత్తుగా 5 వేల రాకెట్లతో హమాస్ దాడి
- 100 మంది దుర్మరణం.. 500 మందికిపైగా గాయాలు
- వెంటనే ప్రతి దాడులకు దిగిన ఇజ్రాయెల్ సేనలు
- 198 మంది పాలస్తీనియన్లు హతం.. 1610 మందికి గాయాలు
- శత్రుత్వానికి ముగింపు పలకాలని ప్రపంచ దేశాధి నేతల పిలుపు

జెరూసలెం, అక్టోబర్ 7: హమాస్ ఉగ్రవాదులు శనివారం ఇజ్రాయెల్‌పై హఠాత్తుగా చేసిన రాకెట్ దాడులు మారణహోమాన్ని సృష్టించాయి. ఇజ్రాయెల్ యుద్ధం పేరిట ప్రతి దాడులకు పాల్పడటంతో రెండు వైపులా వందలాది మంది దుర్మరణం చెందారు. రెండు వేల మందికి పైగా గాయపడ్డారు. శనివారం ఉదయం హఠాత్తుగా గాజా సరిహద్దుల నుంచి 5 వేల రాకెట్లు, డజన్ల కొద్దీ యుద్ధ విమానాలతో హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్ నగరాలపై మెరుపు దాడి చేశారు. భూమి, వాయు, జల మార్గాల ద్వారా విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 100 మంది పౌరులు దుర్మరణం చెందినట్టు.. 561 మంది గాయపడినట్టు వార్తలు వెలువడ్డాయి. వెంటనే పరిస్థితిని సమీక్షించిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు హమాస్‌పై యుద్ధం ప్రకటించారు. 'ఆపరేషన్ ఐరన్ స్వోర్డ్స్' పేరిట గాజాలోని మిలిటెంట్ స్థావరాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో 198 మంది పౌరులు మరణించారని, 1610 మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య జరుగుతున్న దాడుల నేపథ్యంలో ప్రజలందరూ భద్రత నియమాలు పాటించాలని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్ కోరారు. ఇజ్రాయెల్‌లో ఉన్న భారత పౌరులు సురక్షిత ప్రాంతాల్లో ఉంటూ ఇజ్రాయెల్ ప్రభుత్వపు భద్రతా సూచనలను పాటించాలని భారత రాయబార కార్యాలయం పేర్కొంది.

### ఆపరేషన్ అల్-అక్సా ఫ్లడ్ పేరుతో...

'ఆపరేషన్ అల్-అక్సా ఫ్లడ్' పేరుతో ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులకు పాల్పడింది తామేనని హమాస్ ప్రకటించింది. మొదటి 20 నిమిషాల్లోనే 5 వేలకు పైగా రాకెట్లను ప్రయోగించామని తెలిపింది. 'దేవుడి సాయంతో మేం ఈ సమస్య అంతటికీ ముగింపు పలకాలనుకుంటున్నాం. దీంతో జవాబుదారీతనం లేకుండా నిర్లక్ష్యం వహించడం ముగిసిందని శత్రువు అర్థం చేసుకుంటాడు' అని హమాస్ మిలిటెంట్ లీడర్ మొహమ్మద్ దీఫ్ ప్రకటించారు.

### వీధుల్లోని పౌరులపైనా కాల్పులు!

మిలిటెంట్ల దాడి ప్రభావం పవిత్ర జెరూసలెం నగరం, టెల్ అవీవ్‌తో పాటు ఇజ్రాయెల్ దక్షిణ, మధ్య ప్రాంతాలపైనా కనిపించింది. వందలాది మంది ప్రజలు భయంతో దుప్పట్లు, ఆహార పదార్థాలు చేత పట్టుకొని పరుగులు తీయడం కనిపించింది. ఇజ్రాయెల్‌లోకి చొరబడిన ఉగ్రవాదులు వీధుల్లోని పౌరులపై కాల్పులు జరుపుతున్న వీడియోలు సోషల్ మీడియాలో కనిపించాయి. షార్ హనెగెవ్ ప్రాంతీయ కౌన్సిల్‌లోని ఒక పట్టణాన్ని రక్షించేందుకు ప్రయత్నించిన స్థానిక మేయర్ ఓఫిర్ లిబ్‌స్టైన్ ఉగ్రవాదుల దాడుల్లో మరణించారు. మరోవైపు ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని ప్రపంచ దేశాధినేతలు ఖండించారు. ఇరు వర్గాలు శత్రుత్వానికి ముగింపు పలికి పౌరులు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు అనుమతివ్వాలని కోరారు. ఈ కష్ట సమయంలో ఇజ్రాయెల్‌కు అండగా ఉంటామని భారత ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. దాడులపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో శనివారం ఢిల్లీ-టెల్ అవీవ్ మధ్య విమాన సర్వీసులు రద్దు చేసినట్టు ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది.

### హమాస్ అధికారంలోకి వచ్చాక ఉద్రిక్తతలు తీవ్రం

గాజా ప్రాంతాన్ని హమాస్ 2007లో హస్తగతం చేసుకొన్న తర్వాత చాలా యుద్ధాల్లో ఇజ్రాయెల్, పాలస్తీనా మిలిటెంట్లు తలపడ్డారు. అయితే గాజన్ వర్కర్లు తమ దేశంలోకి ప్రవేశించకుండా ఇజ్రాయెల్ సరిహద్దులు మూసేయడం తాజా ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన ఘర్షణల్లో 247 మంది పాలస్తీనియన్లు, 32 మంది ఇజ్రాలీయన్లు, ఇద్దరు విదేశీయులు చనిపోయారు. హమాస్ అయుధాలు పొందకుండా గాజా సరిహద్దుల్లో ఇజ్రాయెల్, ఈజిప్ట్ గట్టి నియంత్రణ విధించాయి. దీంతో చాలా మంది ప్రజలు కనీస అవసరాలైన ఆహారం, నీరు పొందడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. గాజా సరిహద్దుల్ని ఇజ్రాయెల్ మూసేయడం వల్ల, తమ ఇండ్లను ధ్వంసం చేయడం వల్ల తాము ఇబ్బందులకు గురవుతున్నామని గాజా, వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనియన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఐరన్ డోమ్ వ్యవస్థ విఫలమైందా?

ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య శతాబ్దాల నుంచి యుద్ధం కొనసాగుతున్నది. ఎపుడు ఉద్రిక్తతలు వస్తాయో.. ఏ సమయంలో రాకెట్లు వచ్చి పడతాయో తెలియకపోవడంతో ఇజ్రాయెల్ అమెరికా సాయంతో ఐరన్ డోమ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను అభివృద్ధి చేసుకున్నది. శత్రువుల రాకెట్లను, శతఘ్నులను ఈ వ్యవస్థ గాల్లోనే తునాతునకలు చేస్తుంది. 2021 ఉద్రిక్తతల సమయంలో ఈ వ్యవస్థ వల్లే ఇజ్రాయెల్ స్వల్ప నష్టంతో బయటపడింది. కానీ ఈసారి ఈ వ్యవస్థ రాకెట్లను అడ్డుకోలేకపోయిందనే అభిప్రాయం వినిపిస్తున్నది. అందుకే హమాస్ ఉగ్రవాదులు 5000 రాకెట్లను ఇజ్రాయెల్‌పై ప్రయోగించారని విశ్లేషకులు చెప్తున్నారు.

## భారత్-కెనడా వివాదంపై ట్రూడోతో సునాక్ చర్చ

లండన్ : సిక్కు వేర్పాటువాది నిజ్జర్ హత్యోదంతంలో భారత్-కెనడా మధ్య దౌత్య సంబంధాల్లో ఏర్పడిన ప్రతిష్టంభనపై బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోతో చర్చించారు. ఈ సందర్భంగా భారత్‌లోని కెనడా దౌత్యవేత్తల పరిస్థితిని ట్రూడో వివరించారు. ఇరు దేశాల మధ్య ప్రతిష్టంభన తగ్గుతుందని సునాక్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ సమస్యలను ఎదుర్కొనే విషయమై ఇరు దేశాల ప్రధానులు తరచూ చర్చించుకోవాలని నిర్ణయించినట్టు కెనడా ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. నిజ్జర్ హత్యకు భారత ఏజెంట్లే కారణమని గత నెలలో ట్రూడో ఆరోపించిన తర్వాత భారత్-కెనడా మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

### ఆధారాల్లేకుండానే భారత్‌పై ఆరోపణలు

సరైన ఆధారాల్లేకుండా కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆ దేశ పార్లమెంట్‌లో భారత్‌కు వ్యతిరేకంగా ఆరోపణలు చేయటం దురదృష్టకరమని యుఎస్ఐఎస్‌పీఎఫ్ (అమెరికా-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరం) చీఫ్ ముఖేశ్ అఘి అన్నారు. కెనడా ప్రధాని ట్రూడో ఆరోపణలు ఇరు దేశాల సంబంధాల్ని తీవ్రంగా ప్రభావితం చేశాయన్నారు. 'పరిణితి చెందిన వ్యక్తులు ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సి ఉంటుంది' అని అభిప్రాయపడ్డారు.

## కెనడాలో నేలకూలిన శిక్షణ విమానం

### ఇద్దరు భారత ట్రైనీ పైలట్ల మృతి

ఒట్టావా, అక్టోబర్ 7: కెనడాలో ఒక శిక్షణ విమానం నేలకూలిన ప్రమాదంలో భారత్‌కు చెందిన ఇద్దరు ట్రైనీ పైలట్లు సహా ముగ్గురు మృతి చెందారు. బ్రిటీష్ కొలంబియా ప్రావిన్స్‌లో శనివారం విమానం కూలిన ప్రమాదంలో ముంబైకి చెందిన శిక్షణ పైలట్లు అభయ్ గద్రూ, యాష్ విజయ్ రాముగడే మరణించారు. వీరిద్దరూ ఒకే కుటుంబానికి చెందిన వారు. రెండు ఇంజిన్ల తేలిక పాటి విమానం పైపర్ పీఏ-34 సెనెకా హఠాత్తుగా చిల్లీవాక్ సిటీకి దగ్గరలో ఉన్న ఒక మోటెల్ వెనుక చెట్లు, పొదల మధ్య కుప్పకూలింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ప్రమాదంలో మరో పైలట్ కూడా మరణించినట్టు పోలీసులు చెప్పారు. ప్రమాదంపై కెనడాకు చెందిన ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు విచారణ జరుపుతున్నది.

